

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 33.0 - 25.0

చికెన్ ధమాల్..



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 9: చికెన్ ధరలు పడిపోయాయి. శ్రావణమాసం ఎఫెక్టుతో ఈ ధరలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో పౌల్ట్రీ రైతులు దిగాలు చెందుతున్నారు. తణుకులో స్కిన్‌లెస్ రూ.200, తాడేపల్లిగూడెంలో రూ.240గా ఉన్నది. చికెన్ ధరలు మరింత పతనం అయ్యే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. శ్రావణ మాసానికి తోడు వర్షాలు ఎక్కువగా పడుతుండటంతో చికెన్ తినేవారి సంఖ్య తగ్గడంతో ఇప్పట్లో చికెన్ ధరలకు ఊతం వచ్చేలా కనిపించడం లేదు. మరోపక్క జిల్లాలో బ్రాయిలర్ పెంపకం ఎక్కువగా ఉండటం కూడా చికెన్ ధరలు పడిపోవడానికి కారణంగా చెబుతున్నారు. దీంతో బ్రాయిలర్ పెంపకం దారులు నష్టాల్లో కూరుకుపోయారు.

ఎర్ర కాల్వ మరమ్మతులకు నిధులు



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 9: ఎర్ర కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఫ్లడ్ డామేజ్ రిపేర్ నిధుల కింద రూ.53 లక్షల 62 వేలు విడుదలైంది. జిల్లాలో తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం, పట్టింపాలెం, కొమ్ముగూడెం, అప్పారావు పేట, జగన్నాథపురం, మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో ఎర్రకాలువ వెంబడి గట్టుకు పడిన గండ్లు పూడ్చేందుకు ఈ నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఎర్రకాలువ వరదలకు దెబ్బతిన్న గట్టు మరమ్మతులు చేసేందుకు అవకాశం లభించినట్టయింది. సుమారు 55కు పైగా గండ్లు పడటం, తాజాగా ఆరుళ్ల వద్ద పడిన గండి పూడ్చడంతో పాటు గట్టు మరమ్మతులు చేయడానికి సిద్ధం చేశారు.



తహసీల్దార్‌కు బొకే అందిస్తున్న మహిళా ఉద్యోగులు

అక్కడంతా నారీమణులే!

నరసాపురం, ఆగస్టు 9: ఇక నుంచి ఆ కార్యాలయంలో కీలక బాధ్యతలన్నీ మహిళలే నిర్వహించనున్నారు. తహసీల్దార్‌గా మహిళ బాధ్యతలు చేపట్టడంతో కీలకమైన మండల అధికారి నుంచి కింది స్థాయిలో ఏడుగురు ఉద్యోగులు మహిళలే ఉన్నారు. ఉన్న పది మందిలో ఎనిమిది మంది మహిళలు కావడం గమనార్హం. ఈ నియామకం యాదృచ్ఛికంగా జరిగినప్పటికీ ఆఫీస్‌లో సిబ్బందంతా నారీమణులే ఉండటం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ముగియడంతో ఇప్పటి వరకు నరసాపురం తహసీల్దార్‌గా పని చేసిన ప్రసాద్ బదిలీపై తూర్పుగోదావరికి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో గురునాథరెడ్డిని నియమిస్తున్నట్లు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరూ ఊహించని విధంగా రాజరాజేశ్వరి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇది ఎలా జరిగిందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా సీతారత్నం చేస్తున్నారు. ఎన్నికల డీటీగా నాగజ్యోతి, సివిల్‌సప్లై డీటీగా నిర్మల జ్యోతి ఉన్నారు. ఈ నలుగురు కాకుండా ఆర్‌ఐగా యశోద వ్యవహరిస్తున్నారు. సిబ్బంది తక్కువగా ఉండటంతో ముగ్గురు వీఆర్‌ఏలను కార్యాలయ సిబ్బందిగా నియమించారు. వీరు కంప్యూటర్, ఇతర ఆఫీస్ వర్క్ చేస్తున్నారు. ఈ ముగ్గురు కూడా మహిళలే. ఇలా ఉన్న పది మందిలో ఎనిమిది మంది మహిళలే ఉన్నారు. కేవలం ఇద్దరు మాత్రమే పురుషులు విధులు నిర్వహిస్తున్నారు.

ధాన్యం సొమ్ములేవీ..

జిల్లాలో ధాన్యం బకాయిలు రూ.450 కోట్లు..
మూడు నెలలుగా రైతుల ఎదురుచూపు

పాలకొల్లు, ఆగస్టు 9: సూపర్ మార్కెట్‌కు వెళ్లి వెయ్యి రూపాయలు సరుకులు కొనుగోలు చేసి.. నావద్ద సొమ్ములు లేవు తర్వాత తెచ్చి ఇస్తాను అంటే అక్కడ అరువు ఇస్తారా? బిల్లు మొత్తంలో రూ.10లు తగ్గినా కొనుగోలు దారుడుకి సరుకులు ఇచ్చే పరిస్థితి ఉండదు. అయితే రైతు పరిస్థితి ఇందుకు విభిన్నంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ఆరుగాలం శ్రమిస్తున్న రైతన్నకు పంట చేతికి దక్కే వరకు అనుమానమే. ఎంత మేరకు దిగుబడి వస్తుందో చెప్పలేని పరిస్థితి. మరో వైపు పెరుగుతున్న పెట్టుబడి వ్యయం ఇన్ని ఆటుపోట్లను తట్టుకుని పండిన పంటను అమ్ముకుంటే సమయానికి సొమ్ములు రాని పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో రైతులకు దాళ్వా పంటకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.450కోట్లు రావాల్సి ఉంది. సైకో ప్రభుత్వం మారింది సైకిల్ ప్రభుత్వం వచ్చింది కూటమి హయాంలో మేలు జరుగుతుందని ఆశించిన రైతుకు మళ్లీ చేదు అనుభవాలే మిగులుతున్నాయి. జగన్‌రెడ్డి పాలనలో మొదలైన పాపాలు, కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ధాన్యాన్ని మిల్లులకు తోలి వంద రోజులు దాటిపోయినా సొమ్ములు అందక మరో వైపు సార్వా సాగుకు పెట్టుబడి పెట్టలేక సన్న చిన్నకారు కౌలురైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత పథకాలకు ఆగమేఘాలపై సొమ్ములు సిద్ధం చేస్తున్న ప్రభుత్వాలు ఆరుగాలం శ్రమించినా రైతుల విషయంలో సాచివేత ధోరణి అవలంబించడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు పెట్టుబడికై ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నెలలు తరబడి ధాన్యం సొమ్ములు రైతు ఖాతాల్లో జమ చేయకపోవడంపై రైతులు, రైతుసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ధాన్యం తోలి నెలలు అయినప్పటికీ ఖాతాల్లో సొమ్ములు పడలేదని ప్రభుత్వం స్పందించి వడ్డీతో సహా తమ ఖాతాల్లో సొమ్ములు వేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సార్వా పెట్టుబడికి డబ్బు లేదు



ధాన్యం సొమ్ము రూ.1,58,616 తన ఖాతాలో జమ కావాలి. బాకీలు తీర్చి సార్వాసాగుకు పెట్టుబడి పెట్టుకుందామని ఎదురు చూస్తున్నాను. అప్పులు చేసి సార్వా పెట్టుబడి పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందేమో..

- యలమాటి వెంకటేశ్వరరావు, కౌలు రైతు

అప్పులు చేయాల్సిన పరిస్థితి



తాను 3ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నా. ధాన్యం సొమ్ము రూ.1, 98,270 జమ కావాలి. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమకాలేదు. సార్వా పెట్టుబడి కోసం అప్పులకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- తండా ఇస్సాకురాజు, కౌలురైతు

నెలలు తరబడి ఎదురు చూస్తున్నాం



పోడూరులో 5ఎకరాలు కౌలుకు సాగుచేస్తున్నాను. ధాన్యం మిల్లుకు తోలి మూడు నెలలు అయ్యింది. అప్పటి నుంచీ ధాన్యం సొమ్ములు కోసం ఎదురు చూస్తున్నాను. అప్పులు చేసి రోజులు గెంటుకొస్తున్నా.

- స్వామినాయుడు, కౌలు రైతు పోడూరు

రైతుల్ని ఇబ్బంది పెట్టడం దారుణం



రావిపాడులో 3 ఎకరాలు వ్యవసాయం చేసి పండిన ధాన్యాన్ని మిల్లుకు పంపినా ధాన్యం సొమ్ములు ఇంకా జమ కాలేదు. రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయడంతోనే సరిపోతుంది. సార్వా పెట్టుబడులు పెట్టడానికి చేతిలో చిల్లి గవ్వ కూడా లేదు. రైతుల్ని ఇబ్బంది పెట్టడం సరికాదు.

- తాడికొండ సత్యనారాయణ, రైతు, రావిపాడు



నరసాపురంలో

రోడ్డెక్కిన రైతులు

నరసాపురం రూరల్, ఆగస్టు 9: ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.450 కోట్ల ధాన్యం బకాయిలు విడుదల చేయాలని జిల్లా కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ధాన్యం సొమ్ము కోసం శుక్రవారం రైతులతో కలిసి నరసాపురం- పాలకొల్లు 216 జాతీయ రహదారిలోని చిట్టవరం వద్ద రాస్తారోకో చేసి రహదారిని దిగ్బంధం చేశారు. సుమారు గంట పాటు ఆందోళన చేయడంతో ట్రాఫిక్ కిలోమీటర్ మేర నిలిచిపోయింది. డీఎస్పీ గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసాపురం, పాలకొల్లు, పోడూరు, ఆచంట ప్రాంతాలకు చెందిన పోలీసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒకానొక దశలో పోలీసులకు, రైతు సంఘం నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఆందోళనను విరమించలేదు. జిల్లా అధికారులు వచ్చిన స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో ఆర్డీవో అంబరీష్ సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. సంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చి ఐదు నెలలు గడిచిందన్నారు. దీనిపై తాము జిల్లా అధికారులకు అనేక మార్లు విన్నవించామన్నారు. వాయిదాలు వేస్తున్నారే తప్ప సొమ్ము చెల్లించడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకు రూ.13వేలకోట్లను సంక్షేమానికి ఖర్చుపెట్టింది. కష్టపడి రైతు పండించిన ధాన్యానికి మాత్రం సొమ్ము ఇవ్వలేదు ఇదెక్కడి న్యాయమంటూ నిలదీశారు. దీంతో సోమవారం చెల్లిస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కవురు పెద్దిరాజు, శ్రీనివాస్, కామేశ్వరరావు, సీతారామకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, గోపాలకృష్ణ, కృష్ణారావు పాల్గొన్నారు.

15న మంత్రి నిమ్మల జెండా వందనం

భీమవరం టౌన్, ఆగస్టు 9 : ఈనెల 15వ తేదీన నిర్వహించే 76వ స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ పతాకాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవిష్కరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు కలెక్టర్ కార్యాలయానికి అందాయి.

సరిదిద్దాకే 'సర్దుబాటు'

స్థానభ్రంశానికి సీనియార్టీ ప్రామాణికతపై అభ్యంతరాలు

కొత్త జిల్లాల ప్రకారమే మండలాల్లో టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

పరిశీలనకు 'మిగులు' టీచర్లు, వేకెన్సీల జాబితాలు

7



అమ్మవారి ఆలయాలకు భక్తుల తాకిడి

శ్రావణమాసం మొదటి శుక్రవారం మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకుడు మల్లిఖార్జునశర్మ పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దేవస్థానం అధికారులు పర్యవేక్షించారు. పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని, అన్నపూర్ణాదేవిని భక్తులు దర్శించుకున్నారు. గునుపూడి గ్రామదేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవారి ఆలయంలోను మహిళలు పూజలు చేయించుకున్నారు. - భీమవరం టౌన్



వైసీపీకి బిగ్ షాక్

- ప్రత్యక్ష రాజకీయాలకు ఆళ్ల నాని గుడ్‌బై
- ఇప్పటికే పలువురు నేతల రాజీనామా
- టీడీపీలోకి త్వరలో ఏలూరు మేయర్, కౌన్సిలర్లు ?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏలూరులో వైసీపీకి బిగ్ షాక్. ఆ పార్టీనే కొన్నేళ్లుగా అంటి పెట్టుకుని వీర విధేయనేతగా వ్యవహరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని వైసీపీ పదవులన్నింటికీ రాజీనామా చేశారు. ఇక ముందు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనేదిలేదని ప్రకటించారు. దీంతో ఏలూరులో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యింది. ఇంతకుముందే ఏలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు రాజీనామా చేయగా, ఇంకొందరు అంటీ ముట్టనట్టుగా ఉన్నారు. నాని పైకి రాజకీయ వివాద రహితుడిగా పేరొందినా అంతర్గతంగా మాత్రం వైసీపీ లో ఆయన చెప్పిందే వేదం అయ్యింది. ఎందుకనంటే.. ముఖ్య మంత్రిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి కొనసాగిన తరుణంలోను ఆళ్ల నాని అప్పట్లో ఆయనకు సన్నిహితులుగా ఉండేవారు. ఒక రకంగా చెప్పాలంటే వైఎస్సార్ కుటుంబానికి ఆళ్ల నాని ఆది నుంచి సన్నిహితుడు. రాజశేఖరరెడ్డి మరణానంతరం వైసీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్‌ను వీడి జగన్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరిలో నాని చెప్పిందే వేదం. 2014లో జరిగిన ఎన్నికల్లో నాని ఓట మి చెందారు. అప్పటికే ఆయన వరుసగా రెండుసార్లు ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికయ్యారు. దీంతో నానిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీగా ఎంపిక చేశా రు. అప్పటి నుంచి పార్టీ వ్యవహారాల్లో చురుకైన పాత్ర వహిస్తూ వచ్చారు. 2019 ఎన్నికల్లో ఏలూరు నుంచి మూడోసారి ఎన్నికైన ఆయనను జగన్ తన మంత్రి వర్గంలో వైద్యఆరోగ్యశాఖతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. ఆ తర్వాత మంత్రి పదవి నుంచి తప్పుకున్నా ఏలూరులో ఆయన పట్టు సడలకుండా పార్టీ అధ్యక్ష హోదాలోనే కీలకంగా వ్యవహరించారు. ఇక ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనబోనని ఏలూరు సీనియర్ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని నిష్క్రమించడంతో ఆ పార్టీ ఖాళీ అయినట్టయ్యింది. ఎన్నికల ముందే నాని వ్యవహార శైలి నచ్చక పార్టీ సీనియర్ నేత ఏలూరులో కీలకంగా ఉండే ఎంఆర్‌డీ బలరాం, ఆయన సతీమణి ఈశ్వరి వైసీపీ నుంచి నిష్క్రమించి టీడీపీలో చేరారు. ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఏలూరు నగర వైసీపీ కార్పొరేటర్లు కొందరు నానిని కాదని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ ఓటమి అనంతరం ఏలూరు వైసీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరిద్దరు నానికి అత్యంత సన్నిహితులు. దీంతో వైసీపీకి పడిన గండి మళ్ళీ పూడ్చకముందే ఏకంగా ఈసారి నానియే పార్టీ పదవులకు శుక్రవారం రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఏలూరులో వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల నుంచి ఆళ్ల నాని తప్పుకున్నట్టు ప్రకటించడంతో ఆయన స్థానంలో వైసీపీ ఇన్‌చార్జి పదవి ఎవరికి ఇస్తారనే దానిపైనే ఇప్పటికే ఆ పార్టీలో చర్చ ఆరంభమైంది. ఇప్పటికే మూడొంతులు పార్టీ వర్గీయులు టీడీపీ, జనసేన వైపు అనుకూలంగానే ఉన్నారు. పార్టీకి రాజీనామా చేయకపోయినా ఈ రెండు పార్టీలతోనే సాన్నిహిత్యంగా ఉంటున్నారు. ఏలూరు మేయర్ నూర్జహాన్, ఆమె భర్త పెదబాబులు, మరికొంతమంది కౌన్సిలర్లతో కలిసి త్వరలోనే టీడీపీలో చేరబోతున్నట్టు సమాచారం. ఆళ్ల నానికి సమాం తరంగా ఇప్పుడు ఎవరికి పార్టీ పగ్గాలు అప్పగించాలన్నది పార్టీకి విషమ పరీక్షగానే భావించవచ్చు. ఆయన స్థానంలో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, పోల వరం మాజీ సీనియర్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుల్లో ఒకరికి జిల్లా అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు.

నాలుగు అడుగుల నల్లతాచు


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ క్రాంతి కుమార్

లేచిన రోజు బావుంది.. తృటిలో ప్రమాదం తప్పింది. లేదంటే కాటేసేదే.. గురవాయిగూడెం గ్రామానికి చెందిన రైతు దల్లి రామాంజనేయరెడ్డి తన పొలంలోని గేదెల షెడ్డులో ఉన్న గడ్డి తీస్తుండగా గడ్డిలో తాచుపాము బుస్ మంది. వెంటనే భయంతో పరుగులు పెట్టారు. స్నేక్ క్యాచర్ చదలవాడ క్రాంతికుమార్‌కు ఫోన్ చేయగా ఆయన వచ్చి పామును పట్టుకున్నారు. పట్టుకున్న పాము నల్లతాచు అని నాలుగు అడుగులు ఉందని అడవిలో విడిచి పెడతామని తెలిపారు.

- జంగారెడ్డిగూడెం


సమావేశంలో మాట్లాడతున్న డీవీఎస్ వర్మ

కార్పొరేట్ సంపద పంపిణీతోనే శ్రమజీవుల సంక్షేమ సమాజం

తణుకు, ఆగస్టు 9: కార్మికులకు, పేదలకు ఆర్థిక న్యాయం కల్పించే సంక్షేమ సమాజాన్ని సాధించడానికి కార్పొరేట్ సంపద పునం పంపిణీ జరిగి తీరాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో క్విట్ కార్పొరేట్స్ డే సందర్భంగా రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. రైతు కార్యచరణ సమితి గౌరవాధ్యక్షుడు డీవీఎస్ వర్మ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు అన్ని పంటలకు లాభసాటి ధరలను చట్టబద్ధంగా కల్పించడానికి నిరాకరించడంపై నిరసనగా క్విట్ కార్పోరేట్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు.ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి పనిగంటల పెంపుతో సహా వారి హక్కులను హరిస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్పోరేట్ల కోసమే ప్రభుత్వరంగ పరిశ్రమలను వరుసగా అమ్మకాలు చేస్తున్నదని విశాఖ ఉక్కును అమ్మే ప్రయత్నాలను ప్రతిఘటించాలని వివరించారు. సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్ తణుకు స్టడీ సర్కిల్ కార్యదర్శి డాక్టర్ బి.రమేష్, రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు సంకు మనోరమ, లంక కృష్ణమూర్తి, గొల్లపల్లి అంబేడ్కర్, నీలం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు చల్లా అప్పారావు, అజ్జరపు సుబ్బారావు, యర్రమిల్లి నరశింహారావు, సంకు అప్పారావు, వంక సత్య నారాయణ, భూపతిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులను సత్కరించారు.

విస్సాకోడేరులో సఖి సెంటర్ తనిఖీ



పాలకోడేరు, ఆగస్టు 9: విస్సాకోడేరులో ఉన్న మిషన్ శక్తి పథకం సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యు రాలు బూసి వినీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైంగిక హింసకు గురైన మహిళలకు, బాలలకు అత్యవసర సేవలపై ఏం చర్యలు తీసుకుంటున్నారని ఆరా తీశారు. అడ్మినిస్ట్రేటర్ చుక్కా ధనలక్ష్మి బాధిత మహిళలకు అందించే సేవలు, సఖీ వన్ స్టాప్ సెంటర్ ఉద్యోగుల విధుల గురించి వివరించారు. బాధిత మహిళలు, బాలల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఎక్కడైనా ఎటువంటి సంఘటన జరిగినా టోల్‌ఫ్రీ నంబర్ 181ను సంప్రదించాలని కమిషన్ సభ్యురాలు సూచించారు. అంతకుముందు ఉండి ఉమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును క్యాంపు ఆఫీసులో వినీత మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు.

వ్యాసరచన పోటీ విజేతలు వీరే

ఏలూరు అర్బన్, ఆగస్టు 9 : సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ'అనే అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీ విజేతల జాబితాను మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు విడుదల చేశారు. సీనియర్స్ విభాగంలో కె.ఎస్.అమూల్య (వై.ఎస్ పాలెం), వి.గీతిక (ఏలూరు సత్రంపాడు), దీపిక (తిమ్మరాజు పాలెం) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో జి.సాహితి (అత్తిలి), ఎస్.బ్రాహ్మణి (గోపాలపురం), ఎం.హిమశ్రీవర్ష (పాలకొల్లు) విజేతలుగా నిలిచారు. సబ్ జూనియర్స్ విభాగంలో కె.శ్రావణి (అజ్జరం), ఎం.కార్తికేయ (ఉల్లంపర్రు), బి.జోషితసాయి (భీమవరం) తొలి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం బహుమతులు అందజేస్తామన్నారు.



శ్రీనివాస్‌కు సెల్యూట్ చేస్తున్న కిమ్స్ సిబ్బంది.. శ్రీనివాస్ (ఫైల్)

అవయవ దాతకు సెల్యూట్..

ఏలూరు రూరల్, ఆగస్టు 9: తాను మరణిస్తూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగు నింపారు బ్రెయిన్‌డెడ్ అయిన ఓ వ్యక్తి. పుట్టెడు దుఖంలో ఉండి కూడా ఇతరులకు సాయం చేయాలని ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం అందరికి మార్గదర్శంగా నిలిచింది. భర్త మరణిస్తే అతని అవయవాలు దానం చేసి గొప్పమనసు చాటుకున్నారు. ఏలూరు దక్షిణపు వీధికి చెందిన తమ్మన శ్రీనివాసరావు (58) కొద్ది రోజుల క్రితం అకస్మాత్తుగా అనారోగ్యం పాలై బ్రెయిన్‌డెడ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించింది. దీంతో అతని భార్య, కూతురు, శ్రీనివాసరావు అవయవ దానానికి ముందుకు వచ్చారు. శ్రీనివాసరావు నుంచి సేకరించిన అవయవాలు మరో ఐదుగురికి అమ ర్చారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని శుక్రవారం ఏలూరు తీసుకువచ్చారు. నగర ప్రముఖులు, ఆర్యవైశ్యులు అతని భౌతిక కాయానికి నివాళులర్పించారు.

రేపు దేవదాయ శాఖ సిబ్బంది సమావేశం

భీమవరంటౌన్, ఆగస్టు 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా దేవదాయ శాఖ సిబ్బంది సమావేశం ఈనెల 11న తణుకు పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కడలి అనంతరావు, కార్యదర్శి జయరాం, కోశాధికారి నల్లం రామకృష్ణ తెలిపారు. సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవటంతో భవిష్యత్తు కార్యచరణ, సిబ్బందిచే ప్రతిపాదించిన ఇతర విషయాలపై చర్చిస్తారన్నారు.

ట్రిపుల్ ఐటీ రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, ఆగస్టు 9: ఆర్‌జీయుకేటీ పరిధిలో రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు సంబంధించి 238 మందికి కాల్ లెటర్స్ పంపగా 134 మంది ప్రవేశాలు పొందారు. అదే విధంగా ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి 518 మందిని పిలువగా 310 మంది ప్రవేశాలు పొందినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.


గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద జలపాతం...


ఆచంట మండలం కోడేరు వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి

వరద తగ్గుముఖం

పోలవరం/చింతలపూడి/ బుట్టాయగూడెం/ ఆచంట/ఏలూరు క్రైం ఆగస్టు 9: గోదావరి ఉధృతి కాస్త తగ్గింది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.20 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,35,421 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను అధికారులు దిగు వకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.390 మీటర్లు, స్పిల్‌వే దిగువన 22.740 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు. తమ్మిలేరు జలాశయం వద్ద ప్రస్తుతం నీటిమట్టం 348 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 3730 క్యూసెక్కుల వరదనీరు రాగా 4 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

శాంతించిన కొండవాగులు

వారం రోజులుగా ఏజెన్సీ వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మన్యంలోని కొండవాగులు శుక్రవారం తగ్గుముఖం పట్టాయి. దీంతో ఏజెన్సీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం వరకు కూడా ప్రమాదకర స్థాయిలోనే ప్రవహించాయి. మధ్యాహ్నం నుంచి వర్షం లేకపోవడంతో క్రమంగా తగ్గింది. గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ఉన్న ఎర్ర ఎక్కుడు కొండవాగు ఉధృతంగా ప్రవహించగా శుక్రవారం పూర్తిగా తగ్గిపోయి జలపాతంలా చూపరులకు కనువిందు చేసింది.

గోదావరి దోబూచులాట

గోదావరి దోబూచులాడుతూనే ఉంది. కొన్ని రోజులుగా గోదావరి తగ్గి పుష్కర ఘాట్ సైతం బయట పడ్డాయి. అయితే మరలా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా వరద నీరు చేరడంతో శుక్రవారం గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతుంది. పుష్కర ఘాట్‌లు మునిగాయి.

తమ్మిలేరు తగ్గింది

తమ్మిలేరు వాగు వరద ప్రవాహంతో ఏలూరు నగరంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ళల్లోనికి గురువారం రాత్రి చేరింది. ఏలూరు ఆర్డీవో ఖాజావలి ఆధ్వర్యంలో కొన్ని కుటుంబాలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తమ్మిలేరు నీరు శుక్రవారానికి తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి ఇంకా తగ్గిపోయి ఏలూరు నుంచి శనివారపుపేట వెళ్ళే లోబ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం లేకపోవడంతో శుక్రవారం నుంచి వాహనాల రాకపోకలకు పోలీసులు అనుమతించారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో ఉన్న జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా నీరు గురువారం విడుదలవడంతో దీంతో ఒకేసారి వరద నీరు రావడంతో వాహనాలను నిలిపివేశారు. ఏలూరు శనివారపుపేట లోబ్రిడ్జిపై నుంచి ప్రవహించింది. శుక్రవారం సాయంత్రానికి నీటి తగ్గుముఖం పట్టడంతో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.


ఏలూరులో కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు

వరదొస్తే రాకపోకలు బంద్

ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు

కాజ్‌వేపై వంతెన నిర్మించాలని వేడుకోలు

ఏలూరు రూరల్, ఆగస్టు 9:ఏలూరు నియోజకవర్గంలో వర్షం వస్తే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.వరదలు వస్తే కంటిపై కునుకు కరువు అవుతుందని వాపోతున్నారు. వరదొస్తే ఇతర గ్రామాలతో సంబంధాలు ఉండవు. శనివారపుపేట కాజ్‌వేపై వరద వచ్చిన ప్రతిసారి సమీప ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో తమ్మిలేరు వరద తాకిడి పెరగడంతో శనివారపుపేట కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరదనీరు ప్రవహించి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాజ్‌వేపై వంతెన నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రతిఏడాది తమ్మిలేరుకు వరద పోటెత్తిన ప్రతిసారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరదొస్తే కాజ్‌వేపై శనివారపుపేట, దుగ్గిరాల వెళ్ళే ప్రాంతాలకు సంబంధాలు ఉండవు. మూడు కిలోమీటర్లు చుట్టుతిరిగి రావాల్సి ఉంటుంది.వైసీపీ ప్రభుత్వ హయాంలో శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మించటానికి చర్యలు చేపట్టినా కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వానాకాలంలో వరద నీరు కాజ్‌వేపై నుంచి వరద పారుతుంటే పాదచారులు, కళాశాల విద్యార్థులు, వాహనదారులు ఏలూరు నుంచి శనివారపుపేట, విద్యానగర్, దుగ్గిరాల మీదుగా నూజివీడు వెళ్ళేవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

సరిదిద్దాకే 'సర్దుబాటు'

స్థానభ్రంశానికి సీనియార్టీ ప్రామాణికతపై అభ్యంతరాలు

కొత్త జిల్లాల ప్రకారమే మండలాల్లో టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

పరిశీలనకు 'మిగులు' టీచర్లు, వేకెన్సీల జాబితాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 9 : సీనియార్టీ, పలువర్గాలకు మినహాయింపుల కోసం డిమాండ్లు వెల్లువెత్తడంతో వాటిని వీలైనంతమేర పరిష్కరించిన తర్వాతే టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)ను చేపట్టేందుకు వీలుగా వాయిదా వేశారు. పలు అంశాలపై వివరణలు అవసరమైనందున శుక్రవారం జరగాల్సిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు తాత్కాలికంగా నిలిపివేయాలని అన్ని మండలాల ఎంఈవోలకు ఆదేశాలు జారీచేశారు. సోమవారం తర్వాతే ఈ మొత్తం ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి, మార్గదర్శకాల్లో కొన్ని సవరణల అనంతరమే మళ్ళీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టే అవకాశాలున్నాయి. మరోవైపు కొత్త జిల్లాల ప్రాతిపదికన ఆయా మండలాల వారీగా సర్‌ప్లస్ టీచర్లు, డెఫిసిట్ పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలతో కూడిన జాబితాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖకు పంపిన ఉన్నతాధికారులు సంబంధిత వివరాలను మరోదఫా పరిశీలించుకోవాలని సూచించింది. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)లో కొందరు ఉద్యోగంలో చేరిన తేదీ తదితర అంశాల్లో తప్పులు నమోదు చేయడాన్ని గుర్తించి వాటిని సరిచేసి పంపాల్సిందిగా జిల్లా అధికారులకు సూచించారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో సుమారు 370 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు (మున్సిపల్ 'మిగులు' మినహాయించి) సర్‌ప్లస్ జాబితాలో ఉండగా, 220 మందిని కొరతవున్న పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నిబంధనల మేరకు తాత్కాలిక సర్దుబాట్లు చేస్తారని తెలిసింది. భీమవరం కేంద్రంగా వున్న పశ్చిమగోదావరి జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ సర్‌ప్లస్ టీచర్లు, కొరత వున్న పాఠశాలల వివరాలను అక్కడి విద్యాధికారులకు పంపించగా, స్థానికంగా వున్న అక్కడి మండలాల్లోనే సర్దుబాట్లు చేయాల్సి ఉంటుంది.

ఈ అభ్యంతరాలపై సవరణలకు అవకాశం

మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచరును స్టేషన్ (ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల)సీనియార్టీ ప్రకారం ప్రామాణికంగా తీసుకుని అక్కడి జూనియర్‌ను కొరతవున్న పాఠశాలకు సర్దుబాటు చేయాలన్నది తొలుత జారీ చేసిన మార్గదర్శకంగా ఉంది.డివిజన్ స్థాయికి వచ్చేసరికి కేడర్ సీనియార్టీని ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా ఈ రెండూ ద్వంద్వ ప్రమాణాలని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాన్ని తెలిపాయి. గతేడాది మార్చిలో నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఆయా పాఠశాలలకు బదిలీని కోరుకున్న సీనియర్ టీచర్లుసైతం మండలస్థాయిలో ఇపుడు జూనియర్లు అయిపోతారని, ఆ ప్రకారం సీనియర్లను ఏడాదిన్నరలోగా మరో స్కూలుకు సర్‌ప్లస్ పేరిట పంపేయడం సహేతుకంగా లేదన్నది ప్రధాన అభ్యంతరంగా ఉంది. ఇటువంటి సీనియర్లలో గరిష్ఠంగా ఒకేస్కూలులో 8 ఏళ్ళ లాంగ్ స్టాండింగ్‌పై తప్పనిసరిగా బదిలీ అయిన ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. అయితే ప్రభుత్వ వాదన మరోలా ఉంది. సంబంధిత స్కూలులో గరిష్ఠ స్టేషన్ సీనియార్టీకి లోబడి పనిచేస్తున్న టీచర్లు పాఠశాల విద్యార్థులతో మమేకం అయి ఉండటంతో పాటు, స్కూలు అభివృద్ధికి కృషిచేసి ఉంటారని అందువల్ల అక్కడ జూనియర్‌ను కొరతవున్న చోటకు సర్దుబాటు చేయడం సహేతుకమేనని విద్యాశాఖ ఉన్నతాధికారులు సమర్థించు కుంటున్నారు. ఆ ప్రకారం మండల, డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌లకు కేడర్ సీనియార్టీనే ప్రామాణికంగా తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు పట్టు బడుతుండటంతో పీటముడి పడింది. ఇక నూరుశాతం దృష్టిలోపం వున్న టీచర్లకు మాత్రమే పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వడం సరికాదని, దీనిని 70 శాతానికి కుదించడంతో పాటు, శారీరక వైకల్యం, బైపాస్ శస్త్ర చికిత్స చేయించుకున్న టీచర్లనుకూడా వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయించాల్సిందేనంటూ ఉపాధ్యాయ నాయకులు పట్టుబడు తుండటం కూడా ఓ ఆటంకంగా పరిణమించింది. ఇక సర్దుబాటుకు సాంకేతికంగా అవరోధాలు తలెత్తే మున్సిపల్ సర్‌ప్లస్ టీచర్ల విషయమై ఏంచేయాలో డైలమా నెలకొంది. వీటితో పాటు గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 117 ఉత్తర్వుల ప్రకారం కాకుండా, వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం నూతన మార్గదర్శకాలు తీసుకు వచ్చేవరకు వాయిదా వేయాలని కోరుతున్నాయి. మరికొన్ని అభ్యంతరాలు కూడా ఉన్నందున వాటిలో కొన్నింటి నైనా పరిష్కరించి ఉపాధ్యాయులను సంతృప్తి పరిచిన తర్వాతే పని సర్దుబాటు చేపట్టేందుకు వీలుగా కొన్ని రోజులపాటు వాయిదా వేసినట్టు చెబుతున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

23న నరసాపురంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం టౌన్, ఆగస్టు 9 : ఈనెల 23న నరసాపురంలో నిర్వహించే ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ యువత ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ డిగ్రీ కాలేజీలో 23న ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అమర రాజా గ్రూప్, షిరిడీ సాయి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ, జగదీష్ మెరైన్, సంధ్యమెరైన్, సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ హెటిరో ఫార్మా, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, బ్లూస్టార్ మొదలైన ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు నాగేంద్ర- 95020 24765 ప్రసన్న 70138 96277 రాధిక 94418 41622 నంబర్లలో సంప్రదిం చాలని కలెక్టర్ తెలిపారు. పేదల ఇళ్ళలో ప్రగతి కనిపించాలి జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలలో మెరుగైన ప్రగతి కనిపించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.వశిష్ట కాన్ఫరెన్స్‌హాల్‌లో గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఎస్సీ ఎస్టీ లబ్దిదారుల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ పి.పిచ్చయ్య, నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారావు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు



ఏలూరు క్రైం, ఆగస్టు 9 : ఏలూరు మెడికల్ షాపుల్లో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధి కారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అసిస్టెంట్ డైరెక్టర్ హరి ప్రసాద్‌తో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డాక్టర్ బాలు, మల్లిఖార్జున్ సిబ్బంది పాల్గొన్నారు. సద్భావన మెడికల్స్, సూర్య, సిరి, గ్లోబల్, అరుణోదయ, సాయిశ్రీ పవన్ మెడికల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిం చారు. ఒక షాపులో అబార్షన్ కిట్లు, మరో రెండు షాపుల్లో నార్కోటిక్ డ్రగ్స్ మిస్‌యూజ్ అయి నట్లు గుర్తించారు. వాటిపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటికే తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి మూడు షాపుల లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు. మెడికల్ షాపుల్లో తప్పనిసరిగా మందుల అమ్మకాలకు సంబంధించి బిల్లులు ఉండాలన్నారు. గర్భనిరోధక మాత్రలు, అబార్షన్ కిట్లు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత

కొయ్యలగూడెం, ఆగస్టు 9:మండలంలోని కన్నాపురంలోని ఒక గొడౌన్‌లో40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం దాడి చేయగా 40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం దొరికింది. దీని విలువ సుమారు రూ.లక్షా 60 వేలని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన శ్రీనివాసరావుపై 6(ఏ), 7(1) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలవరం సీఐ మధుబాబు, ఆర్ఐ దివ్య వీఆర్వోలు పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల స్వాధీనం

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 9 : బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని జంగారెడ్డిగూడెం సీఎస్‌డీటీ లక్ష్మీ కుమారి శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎం.నవీన్ కుమార్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆదేశాల మేరకు నవీన్ కుమార్‌కు చెందిన శరవణ కిరాణా దుకాణంలో డీఎస్‌వో సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 17 గ్యాస్ సిలిండర్లు, 2.80 క్వింటాళ్ళ రేషన్ బియ్యం, సివిల్ సప్లై ముద్ర కలిగిన 86 పంచదార ప్యాకెట్లు, రెండు ఎలక్ట్రానిక్ కాటాలు సీజ్ చేశారు.


స్క్రీన్‌పై పోటీలను వీక్షిస్తున్న జ్యోతికశ్రీ తల్లిదండ్రులు, మాంటిస్సోరి స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు

ఒలింపిక్స్ పోటీల్లో తణుకు అమ్మాయి..

ఆసక్తిగా తిలకించిన జనం

తణుకు, ఆగస్టు 9 : తణుకు పట్టణానికి చెందిన అథ్లెట్ దండి జ్యోతిక శ్రీ ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో పరుగుపందెం పోటీల్లో పాల్గొంది. ఆమె పతకం సాధించాలని జిల్లా ప్రజలు ఆకాక్షించారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన పోటీలను వీక్షించడానికి టీవీల ముందు అతుక్కుపోయారు. జ్యోతికశ్రీ ప్రాథమిక విద్యనభ్యసించిన మాంటిస్సోరి స్కూలులో స్క్రీన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పాటు, జ్యోతికశ్రీ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మిలు వీక్షించారు. మాంటిస్సోరి స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు మాట్లాడుతూ జ్యోతికశ్రీ 6 నుంచి పదివరకు ఇక్కడే చదువుకుందన్నారు. సంవత్సరంలో సగం రోజుల శిక్షణ కోసం వెళ్లినప్పటికి పదో తరగతిలో 90 శాతంతో ఉత్తీర్ణత సాధించిందన్నారు. ఒలింపిక్స్ వరకు జ్యోతిక వెళ్ళడం స్కూలుకు, పట్టణానికి, రాష్ట్రానికి, దేశానికి గర్వకాణమన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎన్నో మెట్లు అధిగమించి ఒలింపిక్స్ వరకు వెళ్ళిందని భవిష్యత్తులో ఖచ్చితంగా పతకం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


కోమటిగుంటలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు..


సీసలిలో అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ

అమ్మవారికి శ్రావణ మాసం సారె

కాళ్ళ, ఆగస్టు 9 : కాళ్ళ మండలం కోమటిగుంటలో ఉన్న విజయకనకదుర్గమ్మ అమ్మవారికి శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా గ్రామస్థులు సారె సమర్పించారు. అమ్మవారికి 11 రకాల స్వీట్స్, పువ్వులు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లను గ్రామంలోని కోదండ రామాలయం వద్ద నుంచి సుమారు 150 మంది మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈనెల 14వ తేదీన బుధవారం అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు యలమంచిలి వెంకటరమణ, రామాంజనేయులు, గణపతి, రామాలయం కమిటీ సభ్యులు మంతెన నాగాంజనేయులు, గుర్రం సత్యనారాయణ, పులమంతుల ఏసురాజు, వీసం శ్రీను, యలమంచిలి బాబ్జి, కాపుశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. సీసలి లక్ష్మీ దుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి 110 కిలోల పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు.

క్రైం కార్నర్

వాట్సప్ ఫొటోలు మార్ఫింగ్ ..

బెదిరించి సొమ్ములు డిమాండ్ చేస్తున్న వ్యక్తి అరెస్టు



ఏలూరు క్రైం, ఆగస్టు 9: సోషల్ మీడియాలో ప్రొఫైల్ ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకుని న్యూడ్ ఫోటోలుగా మార్ఫింగ్ చేసి తిరిగి వాటిని పంపించి సొమ్ములు ఇవ్వాలని బెదిరిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన ఒక మహిళ తన కుమార్తె ఫోటోలను వాట్సప్‌లో ప్రొఫైల్‌గా పెట్టుకున్నారు. ఆ ఫోటోను ఒక వ్యక్తి డౌన్‌లోడ్ చేసుకుని మార్ఫింగ్ చేసి ఆమె వాట్సప్‌కే పంపించి సొమ్ములు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు ఈనెల 2వ తేదీన ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ రాజారెడ్డి, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన నెల్లూరు జిల్లా సంఘం మండలం బెండదిబ్బ గ్రామానికి చెందిన షేక్ షకీర్ (26) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని ఫోన్‌లో 20 మంది యువతుల ఫోటోలను ఇదే విధంగా మార్ఫింగ్ చేసి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మహిళలు తమ ఫోటోలు, పిల్లల ఫోటోలు కానీ వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో గాని షేర్ చేయవద్దని సీఐ సూచించారు.

అదుపుతప్పిన మోపెడ్..దంపతులకు గాయాలు

ఉంగుటూరు, ఆగస్టు 9 :జాతీయ రహదారిపై కైకరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలయ్యాయి. నిడమర్రు మండలం ఎనికేపల్లికి చెందిన దుర్గం పెద్దిరాజు, ఆయన భార్య పల్లాలు మోపెడ్‌పై పూళ్ళలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా డివైడర్ సమీపంలో అదుపుతప్పి పడిపోయారు. పల్లాలు తలకు వెనుక భాగం దెబ్బ తగిలింది. దీంతో వీరిద్దరినీ హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి కాల్వలో పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 9 : చేపలు పట్టడానికి వెళ్లి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఏలూరులోని మరడాని రంగారావు కాలనీకి చెందిన దోసపల్లి గురవయ్య (30) ఏలూరు రూరల్ మండలం మొండికోడు వద్ద కాలువలో చేపలు పట్టడానికి శుక్రవారం మధ్యాహ్నం గేలం వేశాడు. అక్కడ గుర్రపుడెక్కపై అడుగు వేయగా అకస్మాత్తుగా పడిపోయి మునిగిపోయాడు. తిరిగి పైకి రాలేక మృత్యువాత పడ్డాడు. సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో తిరగబడి ఇద్దరికి గాయాలు

భీమవరం క్రైం, ఆగస్టు 9 : వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి తిరగబడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన బాలం మేరీ రాజ్యలక్ష్మీ కుటుంబ సభ్యులతో శుక్రవారం పాలకోడేరులో పుట్టినరోజు ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా భీమవరం మండలం తోకతిప్ప పెట్రోల్ బంక్ వద్ద ఆటో అదుపు తప్పి తిరగబడింది.దీంతో రాజ్యలక్ష్మీ, బేబి, భూలక్ష్మీలకు గాయాలు అయ్యాయి. ఆటోలో 8 మంది ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రాజు తెలిపారు.

దారి విషయంలో ఇరు వర్గాల కొట్లాట

భీమవరం క్రైం, ఆగస్టు 9 : దారి విషయంలో ఇరు వర్గాలు తగాదా పడటంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రస్తుతం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రూరల్ స్టేషన్ రైటర్ మహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం తోకతిప్ప గ్రామానికి చెందిన బొడ్డు ఏసురాజుకు పొన్నాల ఏసేబురాజుకు దారి విషయంలో పాత గొడవలు ఉన్నాయి. దీన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి ఇరువర్గాలు తగాదా పడ్డారు. దీంతో అటు నలుగురు, ఇటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రాందీ షాపులో చోరీ కేసు..ఇద్దరికి జైలు

ఉంగుటూరు, ఆగస్టు 9 : నారాయణపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధించినట్టు చేబ్రోలు ఎస్ఐ మణి కుమార్ తెలిపారు.మండలంలోని నారాయణపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో 2021 సంవత్సరంలో రూ.3,38,580 నగదు దొంగిలించినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో శుక్రవారం తాడేపల్లిగూడెం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.అరుంధతి తీర్పు నిచ్చారు.ఈ కేసులో రెండో నిందితుడు తిరుమలశెట్టి హరిబాబుకు రెండు సంవత్సరాల నాలుగు నెలల జైలు మూడో నిందితుడు రావూరి మహేష్‌కు ఇరవై నెలలు సాధారణ జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించినట్టు వివరించారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఆర్‌కే పరమేశ్వర్లు, తదితరులు

గణపవరం, ఆగస్టు 9: క్యాన్సర్ వ్యాధి పట్ల గ్రామీణ ప్రజలు మరింత అవగాహన పెంపొం దించుకోవాలని పీఎంపీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌రెడ్డి కోరారు. శుక్రవారం కాశిపాడు సచివాయలం వద్ద క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈనెల 15 నుంచి చేపడుతున్న క్యాన్సర్ నిర్ధార ణ పరీక్షలు అందరూ చేయించుకోవాలన్నారు. సర్పంచ్ కోట నాగేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, రంగరాజు, సీహెచ్ చరణ్, పంచాయ తీ కార్యదర్శి రామారావు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు పాల్గొన్నారు.

ప్రతీ కార్డుదారుడికి సరుకులు అందించాలి

ఉండి, ఆగస్టు 9 : ప్రతీకార్డుదారునికి ఎటువంటి ఇబ్బంది లేకుండా రేషన్ సరుకులు అందించాలని సీఎస్‌డీటీ మహేష్ ఎండీయూ వాహనదారులకు సూచించారు. శుక్రవారం ఉండిలో ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమ తీరును పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని ఉచితంగా అందించాలని, గోధుమపిండిని నగదుకు అందించాలన్నారు. త్వరితగతిన సరుకులను కార్డుదారులకు అందించాలని వాహనదారులకు ఆయన సూచించారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి న్యూరో సర్జన్ రాక

పెంటపాడు, ఆగస్టు 9: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 11వ తేదీ ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేష్ విచ్చేస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాల సంబంధ సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని అవసరమైన వారికి అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒకటి నుంచి పశుగణన

పెంటపాడు, ఆగస్టు 9: జాతీయ పశుగణన వచ్చేనెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం పెంటపాడు డివిజన్ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సులభ రీతిలో గణన చేపట్టేలా ప్రభుత్వం యాప్ రూపొందించిందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ క్రాంతి, డీడీ డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపద పంపిణీయే మార్గం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 9: నాడు తెల్లదొరలను తరిమికొట్టడానికి క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహిస్తే నేడు దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులను తరిమి కొట్టడానికి క్విట్ కార్పొరేట్ ఉద్యమం మొదలైందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ పేర్కొన్నారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో జరిగిన క్విట్ కార్పొరేట్ సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న అంతరాలు, వివక్ష తొలగింపునకు సంపద పంపిణీ ఒక్కటే మార్గమన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, సంఘ అధ్యక్షుడు దువ్వ శ్రీను, కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

దోషులను శిక్షించాలి

తణుకు, ఆగస్టు 9: విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడిని ఖండిస్తున్నట్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఈద రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు పొట్ల సురేష్, కౌరు వెంకటేశ్వర్లు, గొల్లపల్లి అంబేడ్కర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

తణుకు, ఆగస్టు 9: ఉపాధ్యాయులకు పదోన్నతలు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తణుకు, తేతలి, దువ్వ పాఠశాలలను సందర్శించి సంఘ సభ్యత్వాలను స్వీకరించారు. సంఘ నాయకులు రామప్రసాద్, పెద్దిరాజు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

స్లూయిస్‌ల పరిశీలన

అత్తిలి, ఆగస్టు 9 :తిరుపతిపురం సమీపంలోని యనమదుర్రు డ్రెయిన్ స్లూయిస్‌లను అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం డ్రెయిన్ నీరు తగ్గుముఖం పడుతున్నట్టు గుర్తించామన్నారు. పంట పొలాల్లోకి నీరు వెళ్లకుండా ఉండేందుకు బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తహసీల్దార్ వెంట గ్రామ రైతులు పాల్గొన్నారు.

రహదారుపై టోల్ చార్జీలను విరమించుకోవాలి

భీమవరం అర్బన్, ఆగస్టు 9 :రాష్ట్ర రహదారులపై టోల్ చార్జీల ప్రతిపాదన విరమించుకోవాలి అని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. వాహనదారుల నుంచి వెయ్యి కిలో మీటర్ల పరిధిలో టోల్ ట్యాక్సులు వసూలు చేయాలని ప్లాన్ సిద్ధం చేయమని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించినట్టు వార్తలు వస్తున్నాయని ఇది చాలా ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను వసులు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు.ఇప్పటికే వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో లైఫ్‌టాక్స్, రోడ్ టాక్స్, పెట్రోల్, డీజిల్‌పై సెస్సు రూపాలలో ప్రభుత్వాలకు ఆదాయం సమకురుతోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తపన్నులు వేసే ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

శ్రీలంక కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారం

భీమవరంటౌన్, ఆగస్టు 9 : పట్టణంలోని 5వవార్డు నరస్సయ్య అగ్రహారంలోని శ్రీలంక కాలనీవాసులకు ట్రాన్స్‌ఫార్మర్ పాడవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించి వెంటనే అక్కడ 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించడంతో సమస్య పరిష్కారమైంది. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వార్డు నాయకులు కలసి అంజిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పీవీ సూర్యనారాయణ రాజు, గంటా ప్రదీప్, కనకరాజు, మధువర్మ, వెంకటపతిరాజు, కనకరాజు, నరసింహరాజు, ప్రతాప్ వర్మ, అర్జున్‌తోపాటు కోళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.

భక్తి గ్రంథాల పంపిణీ మహద్భాగ్యం

భీమవరంటౌన్, ఆగస్టు 9 : శ్రీలలిత, విష్ణు సహస్రనామ స్తోత్రమ్ వంటి భక్తి గ్రంథాలను భక్త జనులకు శ్రావణమాసంలో పంపిణీ చేయడం అభినందనీయమని మావుళ్ళమ్మ దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మినగేష్ పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, శ్రీశైల దేవస్థానం ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ అద్భుత రచనా సంకలనం చేసిన శ్రీలలిత విష్ణు సహస్రనామ స్తోత్రమ్ దివ్య గ్రంధాన్ని శుక్రవారం ఉదయం మావుళ్ళమ్మ దేవస్థాన ప్రాంగ ణంలో ఆయన ఆవిష్కరించి తొలి ప్రతిని అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రావణమాస ప్రత్యేక పర్వదినమైన శ్రీవరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొనే ముత్తైదువులకు ఈ పవిత్ర గ్రంథాన్ని కానుకగా అందిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో వున్న పలువురు మహిళలకు గ్రంథాలను కుంకుమ ప్రసాదాలతో పాటు వితరణ చేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఆకివీడురూరల్, ఆగస్టు 9 :** మండలంలోని నందమిల్లిపాడు, తాళ్ళకోడు, అప్పారావుపేట గ్రామాలలో అదనపు తరగతి గదులు నిర్మాణం త్వరితగతిన పూర్తిచేస్తామని శుక్రవారం ఎంఈవో-2 సీతారామయ్య తెలిపారు.
- **ఆకివీడు :** విద్యా దృక్పథాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు పాటించాలని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి గుమ్ములూరు సెంటర్ వరకూ ఓరియెంటేషన్, విద్య, వికాసం వంటి విధానాలపై అవగాహన ర్యాలీలో శుక్రవారం జిల్లా ఏసీ కె.సత్యనారాయణ అన్నారు.
- **తణుకు :** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అతికాల ప్రసాదరావు కుమార్తె ఉష ప్రసన్న వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఫిజియోథెరపీ సెంటర్‌కు మిషన్ కొనుగోలు నిమిత్తం రూ. 35 వేలు చెక్కును సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరికి అందజేశారు.
- **గణపవరం :** ఆలయాల్లో భగవంతునికి ధూపదీప నైవేద్యాలకు సమర్పించే అర్చకులకు అందించే నగదును రూ.5 వేల నుంచి 10 వేలకు పెంచుతూ సీఎం నిర్ణయం హిందూ సమాజానికి శుభపరిణామం అని గణపవరం మండల అర్చకుల సంఘం అధ్యక్షుడు చెరుకూరి వరప్రసాదరావు అన్నారు.
- **కాళ్ళ :** కాళ్ళకూరు యూపీ పాఠశాల, దొడ్డనపూడి పరిధిలోని కొత్త చెరువు పాఠశాలలల్లోని రికార్డులు, మధ్యాహ్నం భోజన పథకాన్ని శుక్రవారం ఎంఈవో వి.వెంకటేశ్వరరావు పరిశీలించారు.

గిరిజనులు ఉన్నత చదువులతో అభివృద్ధి చెందాలి

» జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి


కొమరం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, ఆగస్టు 9 : గిరిజనులు ఉన్నత చదువులతో అభివృద్ధి చెంది.. జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసుల దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు వారి పిల్లలను ఉన్నత చదువులను చదివించాలన్నారు. చదువుతోనే ఆర్థిక అభివృద్ధి సాధించగలమని, వెనుకబాటు తనం పోయి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. సమావేశంలో పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని మైదాన ప్రాంతం గిరిజనులకి ఎటువంటి ప్రభుత్వ రాయితీలు, పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు మాదిరిగా తమకు ప్రభుత్వం నుంచి పొందే అన్ని అవకాశాలను కల్పించాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ ఆధార్ కార్డులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన కుటుం బాల్లో చదువుకున్న వారి పూర్తి వివరాలను వెంటనే అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి బి.పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృ,శిశు మరణాలు జరగకూడదు..

జిల్లాలో మాతృ శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని, నిరంతర వైద్య పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ నాగరాణి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో మాతృ, శిశు మరణాలపై ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ కేసును డాక్టరే పర్యవేక్షించాలని, హైరిస్క్ కేసులపై అతి జాగ్రత్తగా వైద్యాధికారులే చూడాలని ఏఎన్ఎం, సూపర్‌వైజర్లపై పెట్టకూడదన్నారు. సుఖవంతంగా ప్రసవం అయ్యే వరకు వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో శిశు సంరక్షణకు అవసరమైన పరికరాల జాబితాను తయారుచేసి అందజేయాలన్నారు. ఈఏడాది జూలై ఆఖరి వరకు రెండు మాతృ మరణాలు, ఆరు శిశు మరణాలు నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వ రరావు, జిల్లా ఇమునైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధాలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ మాధవి కళ్యాణి, డాక్టర్ స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలి

భీమవరంటౌన్, ఆగస్టు 9 : భారతీయులుగా ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి చాటాలని హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 76వ స్వాతంత్ర్య దిన పక్షోత్సవాలలో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో అభివృద్ధి కమిటీ, వెంకటేశ్వరస్వామి దేవస్థానం సహకారంతో ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలంటూ ర్యాలీ , దేశభక్తి ప్రతిజ్ఞ నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, అభివృద్ధి కమిటీ కార్యదర్శి జ్ఞానాపాటి మధుసూదన్‌రావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తాడికొండ కోటేశ్వరరావు, మడిపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ వంటి మహనీయులతో సాధించుకున్న స్వాతంత్ర్య స్వేచ్ఛను దేశభక్తితో అందరూ కాపాడుకోవాలన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలని, ప్రతి ఇంటికి జెండాలను అందజేస్తామన్నారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అల్లూరి చిన బంగార్రాజు, కడలి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు, ఆదిత్య హైస్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడులో రక్తదానం చేసిన యువకులకు పత్రాలు అందజేస్తున్న శ్రీహరిరాజు


భీమవరంలో అన్నదానం..

ఘనంగా మహేశ్‌బాబు జన్మదిన వేడుకలు

ఆచంట/భీమవరం టౌన్/ఆకివీడు, ఆగస్టు9 : సినీ హీరో మహేష్‌బాబు జన్మదినోత్సవం సందర్భంగా వైట్ల కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో బొట్ల చక్రధర్, మధు, నెక్కంటి నవీన్, మనీషా, బలుసు సురేష్, అనేక మంది కృష్ణ, మహేశ్ అభిమానులు పాల్గొన్నారు.

భీమవరంలో పేదలకు అన్నదానం

హీరో మహేశ్‌బాబు సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఘనతలను అందుకున్నారని సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబు యువశక్తి టౌన్ ప్రెసిడెంట్ బోణం వరప్రసాద్ అన్నారు. భీమవరం పట్టణంలోని ఉండి రోడ్డులోని మల్టీ ప్లెక్స్ ఎదురుగా మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్న దానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పేరిచర్ల శ్రీనివాస్‌రాజు, వంకల బోసుయాదవ్, నులి హరికుమార్, మవుళ్ళు ఎస్.రవికుమార్, జీవీ కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి : శ్రీహరిరాజు

రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడినవారవుతారని థియేటర్స్ మేనేజింగ్ పార్టనర్ ఎం.శ్రీహరిరాజు అన్నారు. స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలు, సినీ హీరో మహేష్‌బాబు జన్మదినోత్సవం సందర్భంగా ఆకివీడులోని విజయ థియేటర్ ప్రాంగణంలో ముప్పైమంది యువకులు రక్తదానం చేశారు.

తాగునీరందించాలని తీర్మానం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 9:పడాల శివారు శ్రీరామ్‌నగర్‌కు మంచి నీటిని అందించాలని కూటమి నాయకులు తీర్మానించారు. పడాల గ్రామ సభ శుక్రవారం ఈవోపీఆర్డీ ఎం. వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. తాగునీరు లేక శ్రీరామ్‌నగర్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారికి మంచినీటి పథకం పూర్తయ్యే వరకు గ్రామం నుంచి అందించే ఏర్పాటు చేయాలని కార్యదర్శి శ్రీనివాస్‌ను కోరారు. కూటమి నాయకులు కామిశెట్టి ఉమా శంకర్, కామిశెట్టి శ్రీనివాస్, తన్నిడి సాల్మన్‌రాజు, పులి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు


గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సీతారాం, సుబ్రహ్మణ్యం, కృష్ణ, రంగసాయి

భీమవరం క్రైం, ఆగస్టు 9 : గర్భిణులు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు కె.సుబ్బలక్ష్మి సూచించారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన మూడు నెలల నుంచి తొమ్మిది నెలలు వరకు ప్రతీరోజు క్రమం తప్పకుండా పోషక విలువలైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సీపీఐ నాయకులు మల్లుల సీతారాం, బీజేపీ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా దాతలను సమీకరించి పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ లయన్స్ సీనియర్ నాయకులు కంతేటి వెంకటరాజు తల్లి దివంగత సత్యవతమ్మ పేరిట 66 మంది గర్భిణులకు రొట్టెల, కోడిగుడ్లు సంపూర్ణంగా అందించామని, ప్రతీ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆసుపత్రి వైద్యులు సిబ్బంది, ఆశా వర్కర్స్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జ్వర బాధితులకు అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం

పాలకొల్లు రూరల్, ఆగస్టు 9 :గ్రామాల్లో జ్వర బాధితులకు అన్ని రకాల పరీక్షలు చేసి, వారికి మందులు అందజేస్తున్నామని లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్ అన్నారు. శుక్రవారం చింతపర్రు గ్రామంలో పలువురు జ్వర బాధితులను పరీక్షించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను సేకరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రెయినేజీల్లో షిల్టు తీయించి, ముగ్గు, బ్లీచింగ్ చల్లించారు సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఆరోగ్యవిస్తరణాధికారి గుడాల హరిబాబు, ఏఎన్ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ తారక సత్య గణేష్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూమిలో ఆక్రమణల తొలగింపు


పెనుమదంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పోడూరు, ఆగస్టు 9 : పెనుమదం ఉమా అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఒక ఎకరా 33 సెంట్లు భూమిలోని ఆక్రమణలను దేవస్థానం అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. దేవస్థానం భూమిలో ఆక్రమణదారులు తాత్కాలిక ఇళ్లు కుట్టుకొని ఉండడంతో ఖాళీ చేయాలని గతంలో అధికారులు నోటీసులు జారీచేశారు. ఈమేరకు దేవస్థానం కోర్టు ఉత్తర్వులు ప్రకారం జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈదుల వెంకట సుబ్బారావు, తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, ఈవో పిల్లి సూర్య నారాయణ, పరిసర ప్రాంతాల దేవస్థానం అధికారులు, సిబ్బంది పోడూరు ఎస్ఐ డి.రామ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది సాయంతో ఆక్రమణలను తొలగించారు.

ముద్దాయిలకు ఉచిత న్యాయ సలహా

తణుకు, ఆగస్టు 9: సబ్ జైలులో ముద్దాయిలు న్యాయసేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహా పొందవచ్చని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్న ప్రసాద్ అన్నారు. శుక్రవారం తణుకు సబ్ జైలు, బాలసదన్‌ను సందర్శించారు. పలుచోట్ల అందిస్తున్న సేవలు, ఆహారం నాణ్యత, వసతి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. జైలు క్లినిక్ న్యాయవాది చింతపల్లి నాగేశ్వరరావు, ప్యానెల్ న్యాయవాదులు అజయకుమార్, ఆనందకుమార్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ములూరు సర్పంచ్ అనంతలక్ష్మి

ఆకివీడు, ఆగస్టు 9 : ఆకివీడులో మండల పరిషత్ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకోసారి అధికారులు మండల పరిషత్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని.. సమస్యలు పరిష్కారం కావడంలేదు.. తినడం..తాగడం.. ఉత్సవ విగ్రహాలు మాదిరిగా వెళ్లిపోడం జరుగుతుంది. పంచాయతీల్లో డబ్బులు లేవు..సెక్రటరీలు ఉండరు.. ఏళ్ళ తరబడి ఇన్‌చార్జి సెక్రటరీలే.. గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చెందుతాయి' అని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ, రహదారులు, డంపింగ్, మధ్యాహ్నం భోజనానికి పంపిస్తున్న బియ్యం మంచిగా లేవని సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకెళ్ళారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని వైసీపీ ప్రజాప్రతినిధులు మాట్లాడగా.. జనసేన ఎంపీటీసీలు స్పందిస్తూ రెండు నెలలకే వైసీపీ ప్రజాప్రతినిధులు ఆయాసపడిపోతున్నారని.. గత ప్రభుత్వంలో మూడేళ్ల తమను పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీ పీ కఠారి జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు సైదాల సూర్యనారాయణ, కిల్లి రామకృష్ణ, ఎంపీడీవో వై.రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీకర్, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత


అలంకరణలో వాసవీ మాత

పెనుగొండ, ఆగస్టు 9 : శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం ప్రత్యేక అలంకరణలో దర్శన మిచ్చారు. మొదటి శ్రావణ శుక్రవారం భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

- మొగల్తూరు :శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో మండలంలోని దుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరు భవానీ కాలనిలో వున్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులచే సామూహిక పూజలు జరిపించారు. ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ, పేరుపాలెం, కాళీపట్నం, కెపిపాలెం, రామన్నపాలెం జగన్నాథపురం అమ్మవారి ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
- పాలకొల్లు అర్బన్ : శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా స్థానిక యడ్లబజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో భక్తురాలు గుమ్ములూరుకు చెందిన కడలి సత్యవతి ఆర్థిక సాయంతో 800 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో పాలక ఈవో ఎన్. సతీష్‌కుమార్, సిబ్బంది చిట్టి రాంబాబు, అర్చకులు పాల్గొన్నారు. స్థానిక రామయ్యహాలు ప్రాంతంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహికంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో ఈ ప్రాం తంలో వెలసిన వైష్ణవిదేవి ఆలయ నిర్మాణం జరగాలని పూజలు చేశామన్నారు. 45 మంది మహిళలు, 15 మంది పురుషులు పాల్గొని పూజలు నిర్వహించారు.
- అత్తిలి : అత్తిలి గంటావారి పుంతలో గల కొండలరాయుడు ఆలయంలో నాగ పంచమి సందర్భంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. నాగేంద్రుడికి విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకట సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. భక్తులు పాల్గొన్నారు.


ఆలయంలో హోమం పూజలు.. అలంకరణలో కాశీఅన్నపూర్ణేశ్వరి

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు

పెంటపాడు, ఆగస్టు 9: పెంటపాడు కాశీ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో శుక్రవారం శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు.

కోళ్లపర్రులో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

ఆకివీడురూరల్ : కోళ్ళపర్రులో నాగపంచమి, శ్రావణ శుక్రవారం సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీదేవి, శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవార్ల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా పూజాది కార్యక్రమాలు, హోమాది కార్యక్రమాలనంతరం అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

15న మోడల్ పాఠశాల, పార్కులను ప్రారంభిద్దాం


ఉండి పార్కులో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఉండి, ఆగస్టు 9: ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని. మాజీ మంత్రి కలిదిండి అబ్బాయిరాజు పార్కులను అభివృద్ధి చేసి ఈనెల 15న కలెక్టరు నాగరాణి చేతుల మీదుగా ప్రారంభిద్దామని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఉండిలోని జాతీయరహదారి ఆనుకుని వున్న కలిదిండి అబ్బాయిరాజు, జన్మభూమి పార్కు అభివృద్ధి పనులను అయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోనే పూర్వ పాఠశాలైన ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఇదే పాఠశాలలో చదివిన తన తాతయ్య కాలిఫోర్నియా వెళ్లి ఎంఎస్ పూర్తిచేసిన విషయం గుర్తుచేశారు. పాఠశాలలో గ్రౌండ్‌ను పూడ్చి విద్యార్థులు ఆటలు ఆడుకునే విదంగా దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు వేగేశ్న కనకరాజుసూరి, కొత్తపల్లి నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, కరిమెరక నాగరాజు, ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయిలచ్చిరాజు, కరిమెరక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'వినేశ్ ఫొగట్‌కు అన్యాయంపై ఐక్యంగా పోరాడాలి'

ఆచంట, ఆగస్టు 9 : 2024 ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారతీయ రెజ్లింగ్ క్రీడాకారిణి వినేశ్ ఫొగట్‌కు జరిగిన అన్యాయంపై దేశ ప్రజానికం యావత్తు ఐక్యంగా పోరాడాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎన్ శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒలింపిక్స్ రజత పతకం పొందిన క్రీడాకారులకు ఇచ్చే నగదు, పురస్కారాలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ హోదాలను ఫొగట్‌కు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గుమ్మడి తేజ, మనస్వి, ఆర్ఎంసీ కుమార్, అరిగెల సురేష్, వాలీబాల్ క్రీడాకారులు పల్లపు రాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కోనాయికోడు ఆక్రమణల తొలగింపునకు చర్యలు

మొగల్తూరు,ఆగస్టు 9 :మొగల్తూరు పంచాయతీ పరిధిలో సమస్యాత్మకంగా ఉన్న కోనాయికోడు ఆక్రమణల తొలగింపునకు శుక్రవారం రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలో గల 3.6 కిలోమీటర్ల పొడవు ఉన్న డ్రెయిన్ ఆక్రమణలపాలైంది. స్థానికుడొకరు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాలతో ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించేందుకు వీఆర్వో, సర్వేయర్‌లు వచ్చారు. తమ నివాసాలు తొలగింపునకు ఎటువంటి సమాచారం లేకుండా ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమంటే ఎలా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కనీసం ఐదు రోజులు సమయం ఇవ్వాలని ఆక్రమణదారులు కోరారు. రెండు రోజుల గడువులో తొలగింపునకు అధికారులు అంగీకరించడంతో ఆక్రమణల తొలగింపు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటలక్ష్మి, సర్వేయర్‌లు రాజ్‌కుమార్, అనిత తదితరులున్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ


సబ్‌జైలులో ఆహారాన్ని తనిఖీ చేస్తున్న రత్నకుమార్

నరసాపురం టౌన్, ఆగస్టు 9: నరసాపురం సబ్‌జైలును శుక్రవారం ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దాయిలకు అందుతున్న మెనూపై ఆరా తీశారు. వండిన పదార్థాలను రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్‌జైలులో ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముద్దాలు దీన్ని వినియోగించుకుని సహాయం పొందవచ్చన్నారు. జైలర్ అప్పారావు, న్యాయవాదులు దానయ్యనాయుడు, శిరీష, వరలక్ష్మి, సీహెచ్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

17న బార్ అసోసియేషన్ ఎన్నికలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 9 : పాలకొల్లు బార్ అసోసియేషన్‌కు ఈనెల 17న ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి కర్రి యోహాను, సహాయ ఎన్నికల అధికారి డీఎన్‌వీ గోపాల్ తెలిపారు. శుక్రవారం ప్రెసిడెంట్ పదవికి ఐదుగురు, వైస్ ప్రెసిడెంట్ పదవికి ఇద్దరు, జనరల్ సెక్రటరీ పదవికి ముగ్గురు, జాయింట్ సెక్రటరీ పదవికి ముగ్గురు, ట్రెజరర్ పదవికి ఒకరు, లైబ్రరీ సెక్రటరీ పదవికి ఒకరు, మెంబర్స్ పదవికి ఐదుగురు, మహిళా ప్రతినిధి పదవికి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీల్లో ఉండే వారి వివరాలను ఈనెల 12వ తేదీ సాయంత్రం ప్రకటించనున్నట్టు ఎన్నికల అధికారి కర్రి యోహాన్ తెలిపారు.

గూడూరి వీరమ్మ మృతి


వీరమ్మ (ఫైల్)

భీమవరం అర్బన్, ఆగస్టు 9 : టీడీపీ నాయకులు గూడూరి రామకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు తల్లి వీరమ్మ (90) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమెకు పది మంది సంతానం. ఎనిమిది మంది కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతికి చింతిస్తూ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, మెరగాని నారాయణమ్మ, కోళ్ళ నాగేశ్వరరావు, తదితరులు సంతాపం తెలిపారు.

సీఐటీయూ నిరసన

తణుకు/భీమవరం అర్బన్, ఆగస్టు 9: కార్పొరేట్ కనుసన్నల్లో నడుస్తున్న మోదీ పాలన పోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. శుక్రవారం తణుకు-పైడిపర్రు సెంటర్, బాలుర ఉన్నత పాఠశాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ అంటూ నిరసన తెలిపారు. యూనియన్ నాయకు లు ఆదినారాయణ బాబు, శ్రీనివాసు, చిన్నారావు, గుబ్బల గోపీ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

- దేశాన్ని పాలించమని అధికారం ఇస్తే ప్రధాని మోదీ కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు విమర్శించారు. భీమవరంలో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.
- దేశంలో అన్నం పెట్టే రైతులకు పదిశాతం మాత్రమే బ్యాంకులు అప్పులు ఇస్తుంటే.. కార్పొరేట్లకు మాత్రం 90శాతం అప్పులు బ్యాంకులు ఇవ్వడం దారుణం అని ఆల్ ఇండియా అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణ ముర్తి అన్నారు. భీమవరంలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో దండు శ్రీనివాసరాజు, వాటాల రాంబాబు, దుగ్గిరాల శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకారం


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించిన సర్పంచ్ శ్యామలా సోనిశాస్త్రి

గణపవరం/పెనుగొండ, ఆగస్టు 9: గణపవరం మండలం తహసీల్దార్‌గా వైకేవీ అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.రాంబాబు కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. మండల డీటీలు ఎం.సన్యాసిరావు, ఎం. పోతురాజు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నిడమర్తి కేశవమూర్తి, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

- పెనుగొండ తహసీల్దార్‌గా జి.అనితకుమారి బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆమెకు పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనిశాస్త్రి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

కాళ్ళ, ఆగస్టు 9 :కాళ్ళ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు బదిలీపై వెళ్ళారు.

- తణుకు : పట్టణ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు సంబంధించి పలువురు ఎస్ఐలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణ ఎస్ఐగా చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐగా ఆదినారాయణ, ట్రాఫిక్-2 ఎస్ఐగా బెన్నీరాజు బాధ్యతలు స్వీకరించారు.
- భీమవరం క్రైం : ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబును భీమవరం రెండో పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గూడూరు వీర్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.